స్నాతకోత్సవానికి వేళాయె!

జాతీయ సంస్కృత వర్సిటీ అకడమిక్ భవనం



దేవభాషకు నిలయంగా జాతీయ సంస్కృత యూనివర్సిటీ విరాజిల్లుతోంది.. భారతీయ వైభవానికి ప్రతీకగా వర్ధిల్లుతోంది. దేశవిదేశీ విద్యార్థుల గమ్యస్థానంగా అంతర్జాతీయ స్థాయిలో కీర్తి పతాకను ఎగురవేస్తోంది. విశిష్ట కోర్సులతో విజ్ఞాన సముపార్జనకు కేంద్రంగా విలసిల్లుతోంది. విద్యాపీఠంగా ప్రస్థానం ప్రారంభించి విశ్వవిద్యాలయంగా మహోన్నత సేవలందిస్తోంది. ఈ క్రమంలోనే గురువారం నాలుగో స్నాతకోత్సవానికి సరస్వతీనిలయం ముస్తాబవుతోంది. అత్యుత్తమ అభ్యసనకు 'పట్టా'భిషేకం చేసేందుకు సన్నద్ధమవుతోంది.

- రేపే జాతీయ సంస్కృత యూనివర్సిటీలో 'పట్టా'భిషేకం
- 24 విభాగాలు.. 61 కోర్సులతో విద్యావైభవం
- దేశవిదేశీ విద్యార్థులను ఆకర్షిస్తున్న సరస్వతీనిలయం

సంస్కృత భాషాభివృద్ధే లక్ష్యం



భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా సంస్కృతం వెలుగొందుతోంది. ప్రాచీన భాషలకు మాతృక సంస్కృతమే. విద్యాపీఠం ఎదుగుతూ జాతీయ సంస్కృత వర్సిటీగా గుర్తింపు పొందడంలో ఎందరో మహానుభావుల కృషి ఉంది. సంస్కృత భాషాభివృద్ధే లక్ష్యంగా వర్సిటీ పనిచేస్తోంది.

- జీఎస్ఆర్ కృష్ణమూర్తి, వీసీ, జాతీయ సంస్కృత వర్సిటీ

తిరుపతి సిటీ : సంస్కృత భాషాభివృద్ధే లక్ష్యంగా 1961లో శ్రీవారి పాదాల చెంత సుమారు 43 ఎకరాల విస్తీర్ణంలో కేంద్రీయ సంస్కృత విద్యాపీఠం ప్రారంభమైంది. కేవలం ఒకే విభాగంతో 50మంది విద్యార్థులతో ప్రస్థానం మొదలుపెట్టి అంచలంచెలుగా ఎదుగుతూ సంస్కృత భాషాభివృద్ధికి కృషి చేస్తూ వచ్చింది. 1989లో విద్యాపీఠం ఎదుగుదలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం డీమ్డ్ వర్సిటీగా గుర్తింపు నిచ్చింది. అర్హతలు, విద్యానాణ్యత, విద్యార్థుల సంఖ్య, మౌలిక సదుపాయాలను ప్రామాణికంగా తీసుకుని 2020 మార్చిలోజాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ చేసింది.

అత్యుత్తమ బోధన

జాతీయ సంస్కృత వర్సిటీలో ప్రస్తుతం 24 విభాగాలలో యూజీ, పీజీ, పీహెచ్‌డీ, డిప్లొమా కోర్సులు నడుస్తున్నాయి. ఇందులో అన్ని విభాగాలలో సుమారు 4వేల మంది విద్యార్థులు సంస్కృత విద్యను అభ్యసిస్తున్నారు. సంస్కృత భాషను విస్తృతం చేయాలనే ఉద్దేశంతో డీడీఈ, ఆన్‌లైన్ ద్వారా సుమారు 23 కోర్సులను వర్సిటీ అందిస్తోంది. తాళపత్ర గ్రంథాల అధ్యయనం, వేద, సంస్కృత భాషలోని పరమార్థాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు పరిశోధనలు, అంతర్జాతీయ సదస్సులతో ముందడుగు వేస్తోంది. సంస్కృత వర్సిటీలో దేశవిదేశాలకు చెందిన సుమారు 21,500 మంది విద్యార్థులు ఇప్పటి వరకు యూజీ, పీజీ పట్టాలు పొందారు. 1,050 మంది పీహెచ్‌డీలు పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నారు. ఈ క్రమంలోనే బాల వికాస కేంద్రం పేరుతో తిరుపతి పరిసర ప్రాంతాలలో సుమారు 70 కేంద్రాలను ఏర్పాటు చేసి పిల్లలకు భారతీయ సంస్కృతి, సంస్కృత భాషను నేర్పిస్తోంది.

పట్టాల పండుగ

జాతీయ సంస్కృత వర్సిటీగా గుర్తింపు పొందిన తర్వాత ఇప్పటి వరకు మూడు స్నాతకోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం నాలుగో స్నాతకోత్సవాన్ని వైభవోపేతంగా జరిపించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఇంటర్న్‌షిప్ కోసం ఒప్పందం



ఒప్పంద పత్రాలతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ : ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ కోసం జగతి నెట్‌వర్క్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మధ్య మంగళవారం ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా పిన్సిపల్ డాక్టర్ ఎస్.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ఎంఓయూ చేసుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జగతి నెట్‌వర్క్ ఎండీ డాక్టర్ వాసుదేవ నాయుడు, ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కిరణ్ కుమార్ రాజు, వాణిజ్య విభాగాధిపతి డాక్టర్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

బాధ్యతగా వేద పరిరక్షణ



మాట్లాడుతున్న ముక్తేశ్వరరావు

తిరుపతి సిటీ : వేద పరిరక్షణను విద్యార్థులు బాధ్యతగా భావించాలని టీటీడీ మాజీ జేఈఓ ఎన్ ముక్తేశ్వరావు పిలుపునిచ్చారు. ఎస్వీ వేదిక్ వర్సిటీ, ఉజ్జయిని మహర్షి సందీపని వేద విద్యా ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దక్షిణ భారత క్షేత్రీయ వేద సమ్మేళనంలో భాగంగా రెండోవరోజు మంగళవారం ఆయన ము ఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. వేదాల్లోని అర్థాలను భావితరాలను అందించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో కంచి చంద్రశేఖరేంద్ర వర్సిటీ వీసీ శ్రీనివాస్, వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ భాస్కరుడు, ఆచార్య విరూపాక్ష జడ్డీపాల్, నృత్య కళాశాల అధ్యాపకుడు హరినాథ్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

పాకాల : మండలంలోని దామలచెరువు ఎంపీపీ పాఠశాలలో మంగళవారం తిరుపతి టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్ రీసెర్చ్ వారు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు వెంకయ్యబాబు, రెడ్డి కుమారి మాట్లాడుతూ క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తిస్తే నయం చేయవచ్చని తెలిపారు. మద్యపానం సేవించడం ద్వారా క్యాన్సర్ వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాబ్జీ, గైనకాలజిస్ట్ మెహతాజ్, ఏఎన్ఎం సుధారాణి, డేటా ఆపరేటర్ మహేంద్ర, సిబ్బంది అంజలీ దేవి, మునిరత్నం పాల్గొన్నారు.

'బోర్డు'కు చట్టభద్రత అవసరం

తిరుపతి కల్చరల్ : ఆంధ్ర బోర్డు ఫర్ ఆయుర్వేదకు చట్టభద్రత అవసరమని ది మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి.రాజేష్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఆయుర్వేద కౌన్సిల్ బిల్లు ఆమోదం, గెజిట్ నోటిఫికేషన్ విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఈ బిల్లును అసెంబ్లీలో, శాసన మండలిలో ప్రవేశ పెట్టడం సంతోషకరమన్నారు. సమావేశంలో నేతలు డాక్టర్ బి.రవికుమార్, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ సుందర వదన పాల్గొన్నారు.

27 నుంచి కోదండరాముని బ్రహ్మోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

తిరుపతి కల్చరల్ : శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో ఈనెల 27 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఈఓ శ్యామలరావు తెలిపారు. మంగళవారం టీటీడీ పరిపాలన భవనంలో బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

కేబినెట్ నిర్ణయంపై నిరసన

తిరుపతి కల్చరల్ : ఎస్సీ వర్గీకరణను ఆమోదిస్తూ తీసుకున్న కేబినెట్ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని దళిత, మాల ఉద్యోగులు సంక్షేమ సంఘం నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం అంబేడ్కర్ భవన్ ఆవరణలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రేగంటి దేవానంద్, మాల మహానాడు అధ్యక్షుడు సుదర్శనం, జిల్లా కోశాధికారి వెంకటయ్య, ఉపాధ్యక్షుడు జగదీష్, రాంబాబు, శ్రీరాములు, నాగరాజు పాల్గొన్నారు.

అతివలూ డ్రైవింగ్‌స్కూల్‌ను సద్వినియోగం చేసుకోండి



డ్రైవింగ్ లైసెన్స్ అందుకుంటున్న విద్యార్థిని

తిరుపతి అర్బన్: అలిపిరి ఆర్టీసీ డిపో పరిధిలోని డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కోసం ఇస్తున్న శిక్షణ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి నరసింహులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం అలిపిరి డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కోసం శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికెట్లను అందుకున్న ఇంజినీరింగ్ విద్యార్థిని అక్షిత తమ తండ్రితో కలసి మంగళవారం డీపీటీఓను కలిశారు. ఆయన చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అలిపిరి డ్రైవింగ్ స్కూల్ మాత్రమే ఉందని చెప్పారు. ఇప్పటి వరకు 31 బ్యాచ్‌ల్లో 496 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. అయితే ఇద్దరే మహిళలు శిక్షణ పొందారని చెప్పారు.

వెట్టి చాకిరి నేరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : మానవ అక్రమ రవాణా, వెట్టి చాకిరీ నేరమని కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో రోప్స్ సేవా సంస్థ రూపొందించిన వెట్టి చాకిరీ నిర్మూలనపై అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వెట్టిచాకిరీ అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీలకు అవగాహన కల్పించాలని కోరారు. పనికితగ్గ వేతనం ఉండాలని, ఆ దిశగా రోప్స్ సంస్థ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రమేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఘనంగా 'ప్రపంచ సోషల్ వర్క్ డే'



సోషల్ వర్క్‌డేలో అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ పి.తవితా తులసి ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ సోషల్ వర్క్ డే ఘనంగా నిర్వహించారు. అకడమిక్ గాంధీయన్ స్టడీస్ ఈడీ గోపాల కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి ×ఇంటర్ జనరేషనల్ సోలిడారిటీ క్రియేటింగ్ ఏ వరల్డ్ ఆఫ్ ఈక్వాలిటీ, జస్టిస్ అండ్ హ్యూమన్ రైట్స్ ఫర్ ఆల్ష్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రగతి ఆర్గనైజేషన్ డైరెక్టర్ కేవీ రమణ, ఆంధ్ర బెస్ట్ విమెన్ అవార్డు గ్రహీత కమల, ప్రొఫెసర్ అనురాధ, డాక్టర్ లలిత కుమారి పాల్గొన్నారు. అలాగే ఎస్వీయూలో సోషల్ వర్క్‌డే నిర్వహించారు. ప్రిన్సిపల్ సుధారాణి, సెట్విన్ మేనేజర్ మోహన్, ప్రొఫెసర్ చంద్రశేఖరయ్య, డాక్టర్ రీనా, డాక్టర్ సునీల్, డాక్టర్ కోదండరెడ్డి పాల్గొన్నారు.

సాధికారతతో సమాజ శ్రేయస్సు



శమంతకమణిని సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : మహిళా సాధికారతతో సమాజ శ్రేయస్సు సాధ్యమని పలువురు వక్తలు తెలిపారు. శ్రీపద్మావతి ప్రార్థన మహిళా మండలి 60 వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి మహిళా దినోత్సవం నిర్వహించారు. మండలి అధ్యక్షురలు ఆచార్య టి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ ఆర్.నవనీత రాఘవరెడ్డి, డాక్టర్ వి.వనజాక్షమ్మ, డాక్టర్ సీహెచ్.శ్రీలత, డాక్టర్ శకుంతల, మల్లీశ్వరి అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆచార్యులు టి.సీతాకుమారి, ఆర్.ఉష, ఆచార్య శ్రీదేవి, కేవీ సుచరిత, వి.శకుంతల, శమంతమణి, శ్రీలతను ఘనంగా సత్కరించారు. మండలి కార్యదర్శి ఆర్.మాధవి, ఉపాధ్యక్షులుసి.మహాలక్ష్మి పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై ర్యాలీ



ర్యాలీలో అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ : ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం డ్రగ్స్ నివారణపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ పరమేశ్వర, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు పి.శివకుమార్, సులోచనారాణి పాల్గొన్నారు.

పంచాయతీ వేలం వాయిదా

తిరుపతి రూరల్ : తిరుచానూరు పంచాయతీలో ప్రైవేటు టూరిస్ట్ బస్టాండ్, షాపింగ్ కాంప్లెక్స్‌కు బుధవారం జరగాల్సిన వేలం ప్రక్రియను వాయిదా వేసినట్టు ఇన్‌చార్జి కార్యదర్శి మాధురి మంగళవారం తెలిపారు.

ఆటోలపై ప్రత్యేక దృష్టి

తిరుపతి క్రైమ్ : నగరంలో నిషేధిత హారన్లు పెట్టుకొని ప్రజలను ఇబ్బంది పెడుతున్న ఆటోవాలాలపై ట్రాఫిక్ పోలీసులు మంగళవారం ప్రత్యేక దృష్టి సారించారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆటోలను తనిఖీ చేశారు. ఈ మేరకు 64 ఆటోల హారన్లను తొలగించారు.

ఇంటి స్థలం కోసం దరఖాస్తులు

తిరుపతి తుడా : ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద అర్హులైన నగరవాసుల నుంచి ఇంటి స్థలం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ మౌర్య వెల్లడించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఎలాంటి హౌసింగ్ స్కీమ్ నుంచి లబ్ధిపొందని వారు ఈ నెల 31వ తేదీలోపు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్, రేషన్ కార్డులు, కుల ధ్రువీకరణపత్రం, రూ.3లక్షలలోపు ఇన్‌కమ్ సర్టిఫికెట్, బ్యాంకు పాసుబుక్‌ను సచివాలయ కార్యదర్శికి అందించాలని కోరారు.

సామాజిక దృక్పథం అవసరం



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్ నారాయణమ్మ

తిరుపతి సిటీ : విద్యార్థులకు సామాజిక దృక్పథం అవసరమని ఎస్పీడబ్ల్యూ ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ సూచించారు. పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మంగళవారం ప్రపంచ సోషల్ వర్క్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. విన్స్ ఆర్గనైజేషన్ అధినేత మీరా, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ భద్రమణి, అధ్యాపకులు జపద్మజ, కోకిల, భువనేశ్వరి దేవి, ఉమారాణి పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

తిరుపతి రూరల్ : మండలంలోని శ్రీనివాసపురం పంచాయతీ పార్కులో మహిళలు, వయో వృద్ధులకు శక్తి యాప్‌పై సీఐ చిన్నగోవిందు అవగాహన కల్పించారు. మంగళవారం ఈ మేరకు ఆయన మాట్లాడుతూ స్త్రీల భద్రత కోసం తీసుకువచ్చిన శక్తి యాప్ ఉపయోగాలు, సహాయం పొందే విధానాలను సమగ్రంగా వివరించారు.

మెరుగైన పారిశుద్ధ్యమే లక్ష్యం



మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : నగరంలో మెరుగైన పారిశుద్ధ్యమే లక్ష్యంగా సమూల మార్పులు తీసుకురానున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఇంటింటి చెత్త సేకరణలో లోపాలున్నాయని, వాటిని అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా చెత్తసేకరణకు మరో పదకొండు ఆటోలను కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. నెల రోజుల్లోనే మార్పులకు సంబంధించి ఫలితాలు కనిపిస్తాయని వివరించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఉండదని, మూడు నెలలకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయన్నారు. కండలేరు జలాశయం నుంచి నీటి పంపింగ్ జరుగుతోందని తెలిపారు. స్కావెంజర్స్ కాలనీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని వెల్లడించారు.

పరీక్షల వేళ విద్యుత్ అంతరాయం



చిమ్మ చీకట్లో దొడ్లమిట్ట గ్రామం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): విద్యార్థులకు ఎంతో ముఖ్యమైన పదో తరగతి పరీక్షల సమయంలో గ్రామాల్లో విద్యుత్ అంతరాయంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ, మామండూరు పంచాయతీల్లో మంగళవారం రాత్రి 6.30 గంటల నుంచి కరెంటు సరఫరా లేకపోవడంతో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు చిమ్మ చీకటిలో గడుపుతున్నారు. కరకంబాడి పంచాయతీ గొల్లపల్లి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌లో తలెత్తిన సమస్యతో విద్యుత్ అంతరాయం ఏర్పడిందని ఏఈ, లైన్‌మన్, సిబ్బంది అంతా గ్రామంలోనే ఉండి సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నారని డీఈ రమేష్ తెలిపారు.

ఎస్‌డీహెచ్‌ఆర్‌లో 110మందికి ఉద్యోగాలు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ చక్రవర్తిరెడ్డి

తిరుపతి సిటీ : న్యూ బాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఇటీవల నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 110 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్లు ప్రిన్సిపల్ ఉష తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ స్టార్ హెల్త్, గ్లోబల్ లాజిక్ వంటి సంస్థలు నిర్వహించిన ఇంటర్వ్యూలలో విద్యార్థులు ప్రతిభ చూపి ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి జాతీయ, అంతర్జాతీయ సంస్థలలో తమ కళాశాల నుంచి సుమారు 500మంది విద్యార్థులు ఉన్నతస్థాయి ఉద్యోగాలను సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డి అభినందించారు.

నగరంలో నేడు

- టీటీడీ పరిపాలన భవన వెనుక మైదానంలో ఉదయం 9 గంటల నుంచి క్రీడా పోటీలు.
- ఎస్వీ వేదిక్ వర్సిటీలో ఉదయం 10 గంటలకు వేద సమ్మేళనం. అలాగే ఆగమ సిద్ధాంతంపై సదస్సు.
- అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 9.30 గంటలకు మాల జేఏసీ ప్రెస్‌మీట్.
- తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు.
- జాతీయ సంస్కృత వర్సిటీ స్నాతకోత్సవంపై ఉదయం 11.30 గంటలకు ప్రెస్‌మీట్.
- ఎస్వీయూ మైదానంలో మధ్యాహ్నం 12 గంటలకు క్రికెట్ లీగ్ ఫైనల్.
- కార్పొరేషన్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి బీపీఎస్, ఎల్ఆర్ఎస్ మేళా.
- లీలామహల్ సర్కిల్‌లోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఉదయం 10 గంటలకు తిరుపతి పెయింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం.
- లీలామహల్ సర్కిల్ సమీపంలోని ఆకృతి హాస్పిటల్‌లో ఉదయం 10 నుంచి ఉచిత గైనిక్ లాప్రోస్కోపీ క్యాంప్
- త్యాగరాజ మండపంలో సాయంత్రం 4 నుంచి అన్నమయ్య సంకీర్తనోత్సవాలు
- ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో సాయంత్రం 3 గంటలకు భగవద్గీత పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం.
- కేటీ రోడ్డులోని సప్తగిరినగర్, కమ్మసంఘం హాల్లో ఉదయం 6 నుంచి ఇన్నర్ ఇంజినీరింగ్ కార్యక్రమం.
- రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని శ్రీసాయి సుధా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఎముకల సాంద్రత (బీఎమ్‌డీ)కు సంబంధించి ఉచిత పరీక్షలు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

తిరుపతి లీగల్ :తిరుపతి న్యాయవాదుల సంఘం ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన మంగళవారం ముగిసింది. ఎన్నికల అధికారి ఉషా కిరణ్ నామినేషన్లను పరిశీలించారు. అధ్యక్ష పదవికి న్యాయవాదులు జి.గజేంద్ర, జి.వెంకట కుమార్, ఉపాధ్యక్ష పదవికి మధుసూదన్ రావు, ఎస్.వినూత, ఓ.మునెయ్య, ప్రధాన కార్యదర్శి పదవికి విద్యానాథరెడ్డి, ఎస్.వసుమతి, మహిళా సభ్యురాలి పదవికి ఎస్‌జీ అరుణ, పి.కోమలాదేవి, పి.మంజుల పోటీలో ఉన్నారు. జాయింట్ సెక్రటరీ పదవికి చంద్రమోహన్, కోశాధికారి పదవికి జి.రాజేష్, గ్రంథాలయ కార్యదర్శి పదవికి వి.సునీల్ కుమార్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి పదవికి వి.నాగరాజు మాత్రమే నామినేషన్ వేశారు. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని ఎన్నికల అధికారి తెలిపారు.

పోలీసుల 'పల్లెబస'

తిరుపతి రూరల్ : మండలంలోని దుర్గసముదరం పంచాయతీ వడ్డిపల్లెలో ఆదివారం రాత్రి పోలీసులు పల్లె బస కార్యక్రమం నిర్వహించారు. సీఐ షేక్ షావలీ మాట్లాడుతూ భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు వివరించారు.

సమయపాలనతో లక్ష్య సాధన

తిరుపతి అర్బన్ : విద్యార్థులు సమయపాలన అలవర్చుకుటే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని సమగ్రశిక్ష ఏఎస్ఓ సారథి తెలిపారు. మంగళవారం పద్మావతి పురం ఎంపీపీ స్కూల్‌లో కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ చాలెంజెస్ ఇన్ అడల్టెన్స్ స్టూడెంట్స్ అనే అంశంపై ఓరియంటేషన్ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఒత్తిడి జయిస్తే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు పొందవచ్చని సూచించారు.